నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 20 ఏప్రిల్ 2024 HYDERABAD



అదనపు కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు తన నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, చిత్రంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాలేరు వెంకటేశ్




కంటోన్మెంట్ ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

## నామినేషన్ల సందడి

### హైదరాబాద్ 2, సికింద్రాబాద్ 6.. మల్కాజిగిరి 5.. నామినేషన్లు దాఖలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) /మేడ్చల్/సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండో రోజు కోలాహలంగా జరిగింది. హైదరాబాద్ స్థానానికి 2, సికింద్రాబాద్ స్థానానికి 6 నామినేషన్లు దాఖలయ్యాయి. సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తొలుత సికింద్రాబాద్ టకారాబస్తీలోని తన నివాసం నుంచి ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్ , ముఠా గోపాల్ , మాగంటి గోపీనాథ్ , కాలేరు వెంకటేశ్‌లతో కలిసి వెస్ట్ మారేడ్ పల్లి లోని జీహెచ్ఎంసీ జోనల్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. జోనల్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సికింద్రాబాద్ అదనపు కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు పద్మారావుగౌడ్ తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిచిన తర్వాత పార్లమెంట్‌లో ఇక్కడి సమస్యలపై గళం విప్పి పోరాడుతానన్నారు. పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.



బూత్ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## అంబర్‌పేటకు.. కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పలే

### పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌పై ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 19: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధిపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తనకు ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ ఇచ్చిన అంబర్‌పేటకు ఏం చేశారో చెప్పనేలేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేటకు ఒక్క పని కూడా చేయలేదని, తానే స్వయంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒప్పుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ గోల్నాక డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం శివంరోడ్డులోని ధ్రువ ఎలైట్‌లో డివిజన్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ ..కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తన శాఖలో 4వేల పైచిలుకు పోస్టులు ఖాళీగా ఉన్నా.. ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. అంబర్‌పేటలో చదువుకున్న యువత ఎంతో మంది ఉన్నారని, వారికి ఉద్యోగాలు ఇప్పించి ఉంటే జీవితాంతం గుర్తు పెట్టుకునేవారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ 12వేల కోట్లతో సబర్మతి నదిని అందంగా తీర్చిదిద్దారని, మరీ పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి మూసీని ఎందుకు అభివృద్ధి చేయలేదని, నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఉండి బస్తీల్లో వాటర్ సింటెక్స్ ట్యాంకులు ప్రారంభించి.. దాన్ని పెద్దగా ప్రచారం చేసుకున్నారని విమర్శించారు.

## 'ఎంసీఎంసీ' అనుమతి తప్పనిసరి


సిటీబ్యూరో: ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ కేబుల్, సోషల్ మీడియా ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల్లో ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్వో కార్యాలయం ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటనలకు తప్పనిసరిగా 48 గంటల ముందు ఎంసీఎంసీ అనుమతి కోసం నిర్ణీత దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థి గానీ తన ఏజెంట్ గానీ అప్లై చేసుకోవచ్చన్నారు. ప్రింటింగ్ ప్రెస్ ప్రింట్ చేసిన కరపత్రాలపై పబ్లిషర్ పేరు, అడ్రస్, హ్యాండ్ బిల్ ఇతర పత్రాలు ముద్రించిన సందర్భంలో తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని సూచించారు.

## ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో లుకలుకలు

### మరోసారి భగ్గుమన్న వర్గపోరు

### బూత్ స్థాయి సమావేశానికి విజయారెడ్డికి అందని ఆహ్వానం


### ఎమ్మెల్యే దానం తీరుపై ఆమె వర్గీయుల ఆగ్రహం



ఖైరతాబాద్, ఏప్రిల్ 19 : ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గపోరు భగ్గుమన్నది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య పోటీలా కాకుండా విజయా రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే దానం అన్న విధంగా సీన్ మారింది. సోమాజిగూడలోని జయ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు స్పష్టంగా వెలుగుచూశాయి. ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డికి పార్టీ ప్రత్యేక స్థానం ఇచ్చింది. ఏకంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. తాజాగా ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో విజయారెడ్డిని దూరం పెడుతూ వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అందరినీ కలుపుకొని పని చేయాల్సి ఉండగా, విజయారెడ్డిని దూరం పెట్టడంపై ఆమె వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జయ గార్డెన్స్‌లో జరిగిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమెకు ఎలాంటి ఆహ్వానం పంపలేదని చెబుతున్నారు. ఇప్పటికే గత ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారంటూ విజయారెడ్డి ఎమ్మెల్యే దానంపై హైకోర్టును సైతం ఆశ్రయించగా, న్యాయస్థానం నోటీసులు సైతం జారీ చేసింది. నాటి నుంచి ఇద్దరి మధ్య విభేదాలు మరింత ఎక్కువైనట్లు తెలుస్తోంది.

**పార్టీలో చేరని వారి ఫొటోలు..**

జయగార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలల్లో పార్టీలో చేరని నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్ల ఫొటోలు సైతం కనిపించడం విశేషం. దానం నాగేందర్ చెప్పాపెట్టకుండానే పార్టీ మారినప్పటి నుంచి బీఆర్ఎస్‌లో ఆయన వెన్నంటి నడిచిన అనేక మంది నేతలు ఒక్కొక్కరుగా దూరమవుతూ వచ్చారు. ఐదేండ్ల పాటు నియోజకవర్గం, కార్యకర్తలు, ప్రజలను పట్టించుకోని ఎమ్మెల్యే.. ఇప్పుడు ఎంపీగా తమకు ఏం ఒరగబెడుతారని బాహాటంగానే ఆరోపిస్తున్నట్లు తెలిసింది. దీంతో సంఖ్యా బలం ప్రదర్శించేందుకు కాంగ్రెస్‌లో చేరని వారి ఫొటోలను సైతం ఫ్లెక్సీల్లో ప్రదర్శించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### కూకట్‌పల్లిలోనూ..

కేపీహెచ్‌బీ కాలనీ/అల్లాపూర్, ఏప్రిల్ 19 : కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలో పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించి.. కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్ డివిజన్ ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఫ్లెక్సీలలో తమ ఫొటోలు వేయలేదని సీనియర్ నేతలు ప్రశ్నించడంతో స్థానిక ఇన్‌చార్జి బండి రమేశ్ సమావేశానికి హాజరుకాకుండానే వెళ్లిపోయారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సైతం సమావేశాన్ని బహిష్కరించడంతో పట్టుమని పదిమంది స్థానిక నాయకులు కూడా ఆ సమావేశంలో కనిపించలేదు. అలాగే ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధించిన సమాచారం తమకు ఇవ్వలేదని, కాంగ్రెస్ సీనియర్ నేత మోయిజ్ సభ వేదికపై ఇన్‌చార్జి బండి రమేశ్‌ను నిలదీశారు. నియోజకవర్గంలో ఏ సమావేశం నిర్వహించినా.. తమకు సమాచారం ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోయిజ్ కు తోడుగా మూసాపేటకు చెందిన మరో ఇద్దరు సీనియర్ నాయకులు కూడా తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారమంతా ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి ఎదుటే జరగడంతో నివ్వెరపోవడం ఆమె వంతైంది.

## ఆశీర్వదించండి

### ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, ఏప్రిల్ 19: బీఆర్ఎస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతుందని, ప్రజలు కారు గుర్తుకు ఓటు వేయాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత కోరారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఒకటో వార్డు పరిధిలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి నివేదిత పర్యటించారు. న్యూ బోయిన్‌పల్లి పెద్దతోకట్ట, కంసాలి బజార్‌తో పాటు పలు బస్తీల్లో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలు పంచుకుంటున్న తనను ఆశీర్వదించి గెలిపిస్తే సేవకురాలిగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రామకృష్ణ, రాము, పద్మ, అంబిక, సబిత తదితరులు పాల్గొన్నారు.



బిషప్ కార్డినల్ పూల ఆంటోనిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

## క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 19: రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఆర్చి బిషప్ కార్యాలయంలో కార్డినల్ పూల ఆంటోనిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలను మంజూరు చేసిందని, విదేశాల్లో చదువుకునేందుకు విద్యార్థికి ఆర్థిక సహాయంగా రూ. 20 లక్షలు మంజూరు చేయడంతో వందలాది మంది క్రిస్టియన్ యువకులు వివిధ దేశాల్లో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు లియోనార్డ్, మహేశ్, లియో, తిమోతి, ఆనంద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఓటు హక్కు వినియోగించుకోండి

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : నగరంలోని పలు కాలనీల్లో మహిళా స్వయం సహాయక సంఘాలతో ఓటరు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ.. లా కాలేజీ, కూరగాయల మార్కెట్, బ్యాంక్‌లలో స్వీప్ కార్యక్రమాలను నిర్వహించారు. మెట్టుగూడ సీతాఫల్ మండి, రాంనగర్ కూరగాయల మార్కెట్, పడాల రాంరెడ్డి లా కాలేజీ, యూసుఫ్‌గూడ, తార్నాకలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. చార్మినార్ జోన్ కార్యాలయంలో సెక్టార్ ఆఫీసర్ బీఎల్వో, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటర్ టర్న్ ఔట్, అన్ని పోలింగ్ కేంద్రాల వారీగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్లమ్, మార్కెట్లకు వెళ్లి ఓటరు అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా చేయాలని జోనల్ కమిషనర్ వెంకన్న సూచించారు.

## నిబంధనల మేరకే పనిచేయాలి

### కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు

సిటీబ్యూరో: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నోడల్ అధికారులు ఎన్నికల విధులను నిర్వర్తించాలని వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, అమిత్ శుక్లాలు సూచించారు. శుక్రవారం వీరు జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా ఎన్నికల అధికారి, సీపీ, రిటర్నింగ్ అధికారులు, ఆయా నోడల్ అధికారులు, సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే అధికారులందరూ నడుచుకోవాలని పరిశీలకులు చెప్పారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా చేసిన ఏర్పాట్లు, వివిధ కమిటీల పనితీరుపై పరిశీలకులు సెంథిల్‌కుమారన్, అమిత్ శుక్లాలు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**'ఖర్చుల వివరాలు నమోదు చేయాలి'**

మేడ్చల్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ మగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు అభ్యర్థుల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకులు మనోజ్ , ధృవ్ బోళా సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్స్, అకౌంటింగ్ బృందాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడారు.

## ఎన్నికల వ్యయం

### రికార్డులు పక్కాగా నిర్వర్తించాలి

### బ్యాంక్ అకౌంట్ ఆధారంగానే అభ్యర్థుల వ్యయం లెక్కింపు

### పూర్తి అవగాహనతో నామినేషన్లు వేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి అవగాహనతో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీపీ శ్రీనివాస్ రెడ్డితో కలిసి రోనాల్డ్ రాస్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంబించాల్సిన విధానాలను కమిషనర్ వివరించారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారని తెలిపారు.

**నిబంధనలు తప్పనిసరి**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన వారైన పక్షంలో తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వో నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ తెరవాలని, దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ పక్కాగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ. 95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చని, సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కిస్తామన్నారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-III ఏ లో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. నామినేషన్ సమర్పించే ముందు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. నామినేషన్ పర్వం మొదలైనందున ఇప్పటికే 144 సెక్షన్ విధించినట్లు సీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నామినేషన్ సందర్భంగా ఎన్నికల నియమావళి పరిధిలోనే ఉండాలని, రాత్రి 10 గంటల తర్వాత ప్రచారం చేయకూడదని చెప్పారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్

**దీర్ఘకాలిక సెలవులు రద్దు**

వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది కొరత ఏర్పడటంతో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న వారిని వెంటనే ఎన్నికల విధులకు రిపోర్టు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక సెలవులతో పాటు విదేశీ ప్రయాణాలకు శాఖల అనుమతులు తీసుకున్న వారు కూడా ఎన్నికల విధుల్లోకి రావాలని ఆదేశించారు.

